సాక్షి
జగిత్యాల
శనివారం । 10 । జూన్ । 2023



గ్రామాల అభివృద్ధే ధ్యేయం

రాయికల్ : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. - 8లో



సిగ్నల్ కేబుల్ దొంగల అరెస్ట్

మల్యాల : నూకపల్లి రైల్వేస్టేషన్‌లో సిగ్నల్ కేబుల్ చోరీ చేసిన కేసులో పదిమంది దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

గరిష్టం/కనిష్టం
40.0/30.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది. వడగాల్పుల తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

వెంకన్నకు క్షీరాభిషేకం



ముస్తాబైన శ్రీవేంకటేశ్వరస్వామి

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం క్షీరాభిషేకం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు నేరెళ్ల శ్రీనివాసాచార్యుల మంత్రోచ్ఛారణలతో తొలుత లక్ష్మీహవనం నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ఆర్టీసీ సేవలు విస్తరించాలి



కిట్లు అందజేస్తున్న విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి(కోరుట్ల): గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ సేవలను మరింత విస్తరించాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సూచించారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం విలేజ్ బస్ ఆఫీసర్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కోరుట్ల, మెట్‌పల్లి డిపోల పరిధిలో బస్ ఆఫీసర్లుగా నియమించిన 20మందికి ఆయన కిట్లు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్టీసీ లాభాల బాటలో నడిచేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రజల మన్ననలు పొందేలా సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రావు, డీఎంలు వేదవతి, ప్రసూనలక్ష్మి, ఎంవీఐ రంజిత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

జగిత్యాల: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బైరం హరికిరణ్, ప్రధాన కార్యదర్శి మచ్చ శంకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో శుక్రవారం ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. సంఘం వ్యవస్థాపకుడు మొయినొద్దీన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ, తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న విద్యాశాఖ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల ప్రవీణ్, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలిసెట్‌పై అవగాహన

కోరుట్ల: పాలిసెట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈనెల 12, 13 తేదీల్లో అవగాహన కల్పిస్తామని ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ శివారులోని పాలిటెక్నిక్‌లో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. పాలిసెట్ – 2023లో అర్హత సాధించిన విద్యార్థులు కౌన్సెలింగ్ కోసం ఆన్లైన్‌లో స్లాట్ బుకింగ్, రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, సీటు అలాట్‌మెంట్ వంటి విషయాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సీహెచ్ శ్రీకాంత్, సెల్ నంబరు : 738 61 10877, టి.బాలకృష్ణ, సెల్ నంబరు : 95 734 33959, రమేశ్, సెల్ నంబరు 90525 33 158లో సంప్రదించాలని ఆయన సూచించారు.

బీసీలకు రూ.10లక్షలు ఇవ్వాలి



మాట్లాడుతున్న గాజుల నాగరాజు


జగిత్యాలటౌన్: ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష స్థానంలో బీసీ కులవృత్తులకు రూ.పది లక్షలు చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాజుల నాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీవో కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తుండంతో ప్రభుత్వం బీసీల జపం చేస్తోందని, ఇది ఓట్లు రాబట్టుకోవడం కోసమేనని విమర్శించారు. బీసీలపై నిజమైన ప్రేమ ఉంటే రూ.పదిలక్షల సాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో 50శాతం సీట్లు కేటాయించే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. జిల్లా కేంద్రంలో బీసీ భవన్ నిర్మాణానికి ఎకరం స్థలం కేటాయించాలని అన్నారు. నాయకులు ఓరుగంటి భార్గవరాం, జనగామ రాజిరెడ్డి, పెండం గంగాధర్, మొగులోజీ విజయ, పద్మ, గంగం జలజ, శ్రీనివాస్, వంశీ తదితరులు ఉన్నారు.

జిల్లాలో

ఫుడ్ ప్రాసెసింగ్ హబ్

- 195 ఎకరాల్లో స్పెషల్ జోన్
- మెట్‌పల్లి సమీపంలో 40 పరిశ్రమల కోసం సదుపాయాలు
- రూ.40 కోట్లతో టీఎస్‌ఐఐసీ ఆధ్వర్యంలో పనులు
- అక్టోబరు ఒకటిన సీఎం లేదా కేటీఆర్ చేత పనులు ప్రారంభం
- జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులపై కన్ను
- ఇప్పటికే ఆసక్తి చూపించిన భువి, ధాత్రి సంస్థలు
- కరోనా, ఉక్రెయిన్ సంక్షోభాలతో వ్యవసాయోత్పత్తులకు డిమాండ్





మెట్లచిట్లాపూర్ ఫుడ్ ప్రాసెస్ జోన్ ప్లాన్ ప్లాన్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాలో భారీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ రానుంది. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం మెట్ల చిట్టాపూర్ వద్ద 'స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్' ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. కరోనా, ఉక్రెయిన్ యుద్ధం తర్వాత ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ ఉత్పత్తులకు పెరిగిన డిమాండ్‌ను అనుకూలంగా మలుచుకునే యోచనలో తెలంగాణ సర్కారు ఉంది. అందుకే, ఈ ఫుడ్‌ప్రాసెసింగ్ జోన్ కోసం.. 195 ఎకరాల భూమిని కేటాయించింది. ఎంపిక చేసిన భూమిలో మౌలిక సదుపాయాల కల్పనలో తలమునకలైంది. ఈస్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో కీలకమైన రోడ్లు, విద్యుత్తు, నీరు తదితర ముఖ్యమైన మౌలిక సదుపాయాలు కీలకం. అందుకే వీటిని వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక సదుపాయాల సంస్థ(టీఎస్‌ఐఐసీ) పట్టుదలగా ఉంది. పార్క్ అభివృద్ధికి సంబంధించిన బ్లూప్రింట్ ప్రకారం వసతులు కల్పిస్తోంది.

రూ.40 కోట్లతో సదుపాయాలు..

మెట్‌పల్లి మండలం మెట్ల చిట్టాపూర్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఈ ప్రాంతం భౌగోళికంగా ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు మధ్యలో ఉంది. అందుకే ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నారు. ఫుడ్‌ప్రాసెసింగ్ జోన్ పారిశ్రామిక అవసరాలకు కావాల్సిన నీటిని అందించేందుకు వరద కాల్వ, సరుకు రవాణాకు రోడ్డు, రైలు మార్గాలు అందుబాటులో ఉన్నాయి. అంతేకాకుండా.. వ్యవసాయంపరంగా ఈ మూడు పాత జిల్లాల్లో కరీంనగర్‌లో వరి, మొక్కజొన్న, మామిడి, నిజామాబాద్‌లో చెరుకు, మొక్కజొన్న, పసుపు, ఆదిలాబాద్‌లో వరితోపాటు పత్తి బాగా పండుతాయి. ఈ పంటలతోపాటు వాటి ద్వారా ఉత్పత్తి అయ్యే బై ప్రోడక్టులను సద్వినియోగం చేసుకోవాలన్న ఉద్దేశంతో ఈ ప్రాంతంలో స్పెషల్ ఫుడ్‌ప్రాసెసింగ్ జోన్‌ను అభివృద్ధి చేస్తున్నారు. మొత్తం 194.67 ఎకరాల్లో రూ.40 కోట్ల నిధులతో ఇక్కడ 'స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్‌జోన్' నిర్మిస్తారు. ప్రస్తుతం ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ కోసం ఎంపిక చేసిన ప్రాంతంలో టీఎస్‌ఐఐసీ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సమాయత్తం అవుతోంది. ప్రధానంగా విద్యుత్తు, రోడ్లు, నీరు తదితర సదుపాయాలకు కావాల్సిన పనులను చేపడుతోంది. ఈ పార్క్ నిర్మాణ పనులు అధికారికంగా అక్టోబరు ఒకటిన ప్రారంభం కానున్నాయి.

ఇక్కడే ఎందుకు?

ఉమ్మడి రాష్ట్రం ఏర్పాటు నుంచే కరీంనగర్ జిల్లా వరి ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచింది. తెలంగాణ ఏర్పాటు తర్వాత వరి ఉత్పత్తి మరింత పెరిగింది. కరీంనగర్ జిల్లాలో 2.71 లక్షల ఎకరాలు, సిరిసిల్లలో 1.71 లక్షల ఎకరాలు, పెద్దపల్లిలో 2 లక్షల ఎకరాలు, జగిత్యాల జిల్లాలో దాదాపుగా 2.97 ఎకరాలు మొత్తంగా 9.39 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. ఈ జిల్లాల్లో దాదాపు 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వరకు ఉత్పత్తి అవుతోంది. ఉమ్మడి జిల్లాలో ఇథనాల్‌ను వరిగడ్డి, నూకలు, చెరుకు, మొక్కజొన్న నుంచి తీస్తారు. దీంతో మెట్లచిట్టాపూర్ పరిసర జిల్లాల నుంచి ఉత్పత్తి అయిన ప్రతీ వ్యవసాయ ఉత్పత్తిని ఇక్కడ ప్రాసెస్ చేసేందుకు లేదా ఇథనాల్ తదితరాలు ఉత్పత్తి చేసేందుకు ఉపయోగపడుతాయి. కరోనా సంక్షోభం, ఉక్రెయిన్ యుద్ధం తర్వాత దేశంలో వరి, నూకలు, తౌడు, ఉనుకకు విపరీతంగా డిమాండ్ పెరిగింది. ఈ పరిస్థితిని తెలంగాణ ప్రభుత్వం అనుకూలంగా మార్చుకునే యోచనలో ఉంది. అంతేకాకుండా వరి ధాన్యాన్ని ఆడించగా వచ్చే ఉనుక, తౌడు, పరం తదితరాలతోనూ ఇక్కడ బ్రాన్ ఆయిల్, బిస్కట్ తదితర పరిశ్రమలను సైతం నిర్మించవచ్చు.

పెట్టుబడులు ఆకర్షించేలా..

ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం.. స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో ఉన్న భూమిలో ప్లాటింగ్ కోసం ప్లాన్ గీశారు. స్థానిక వ్యవసాయ ఉత్పత్తుల లభ్యత ఆధారంగా జాతీయ, అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షించే పనిలో పరిశ్రమలశాఖ ఉంది. అందుకు అనుగుణంగా దాదాపు 40 వరకు చిన్న, పెద్దతరహా పరిశ్రమల కోసం కనిష్ఠంగా రెండు ఎకరాల నుంచి గరిష్ఠంగా పది ఎకరాల వరకు పరిశ్రమలు స్థాపించుకోవచ్చు. ఆ విధంగా ప్లాటింగ్‌ను మార్కింగ్ చేసిన టీఎస్‌ఐఐసీ అధికారులు.. పరిశ్రమ సామర్థ్యాన్ని బట్టి ఇందులో మార్పులు కూడా చేసే వీలుందని తెలిపారు. అందులో భాగంగానే ఇక్కడ ఇథనాల్ తయారీ పరిశ్రమల ఏర్పాటుకు పలువురు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ పార్క్ ఏర్పాటును పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ తొలిసారిగా ప్రకటించారు. అదే సమయంలో భువి కెమికల్స్ ఆధ్వర్యంలో రూ.1,040 కోట్లతో రోజుకు లక్ష లీటర్ల ఇథనాల్ సామర్థ్యంతో ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఆసక్తి చూపించింది. ధాత్రి బయో సొల్యూషన్స్ ఆధ్వర్యంలో సిలికా ఉత్పత్తి కోసం రూ.160 కోట్ల వ్యయంతో పరిశ్రమ స్థాపించేందుకు ఆసక్తి కనబరిచారు. దీనితోపాటు బయోగ్యాస్ ఉత్పత్తి చేయాలన్న ఆలోచనలో ఉన్నారని సమాచారం.

గ్రూప్–1 ప్రిలిమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: జిల్లాలో ఈనెల 11న జరిగే గ్రూప్–1 సర్వీస్ ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. శుక్రవారం అధికారులతో ఆమె ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా 21పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 6,885 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ కమిషన్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ఎంపిక చేసిన పరీక్ష కేంద్రానికి 2 గంటల ముందే చేరుకోవాలని అభ్యర్థులకు సూచించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. సమస్యల నివృత్తి, పరిష్కారం కోసం హెల్ప్‌లైన్ నంబరు 1800 425 7620 అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలకు సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకు రావద్దని సూచించారు. అభ్యర్థులు ఒరిజినల్ ఐడీ కార్డ్స్, బాల్‌పెన్స్‌తో మాత్రమే హాజరు కావాలన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు మకరంద్, లత పాల్గొన్నారు.

రేపు కవి సమ్మేళనం

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకల సందర్భంగా ఈనెల 11న కవి సమ్మేళనం నిర్వహిస్తామని కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెలక్టర్ మాట్లాడారు. తెలంగాణ అస్తిత్వం, తెలంగాణ ప్రగతి, కవితాంశంతో స్థానిక సమీకృత కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం సాయంత్రం కవి సమ్మేళనం నిర్వాహిస్తామన్నారు. ఇప్పటికే ఈ అంశంపై కవితలను ఆహ్వానించగా జిల్లా వ్యాప్తంగా 66 కవితలు వచ్చాయని పేర్కొన్నారు. కవితా పఠనం చేసిన కవులను ఈసందర్భంగా సత్కరిస్తామని పేర్కొన్నారు. సాహిత్యాభిమనులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కలెక్టర్ కోరారు.

ధాన్యంలో తరుగు.. రైతుల ఆగ్రహం

- కోరుట్ల, కొత్తదాంరాజ్‌పల్లిలో అన్నదాతల నిరసన

కోరుట్ల: అడిగే వారు లేరు.. పట్టించుకునే వారు అంతకన్నా లేరు.. ఇదేన్న ధీమాతో కోరుట్ల పీఏసీఎస్‌లో ధాన్యంలో అడ్డగోలుగా తరుగు తీస్తున్నారు. రైతులను నష్టాలకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వడ్ల కొనుగోళ్ల చివరిదశకు చేరుకుంటున్న క్రమంలో తరుగు దోపిడీ మితిమీరిపోతోంది. కోరుట్ల పీఏసీఎస్(సింగిల్‌విండో) పరిధిలో కోరుట్ల శివారులోని సాయిబాబా ఆలయం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ఇందులో నిన్నామొన్నటి వరకు 3 కేజీల నుంచి 5 కేజీల వరకు తరుగు తీసిన పీఏసీఎస్ సిబ్బంది నాలుగైదు రోజులుగా క్వింటాలుకు పది కిలోల తరుగు తీయడం వివాదాస్పదంగా మారింది. తాను 91 క్వింటాళ్ల బస్తాల ధాన్యం అమ్మితే తరుగు పేరిట 7 క్వింటాళ్ల వడ్లు కోత కోశారని ఓ రైతు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాడు. చాలామంది రైతులు ఇదే రీతిలో తరుగు తీశారని చెబుతున్నారు. ఇదేమని అడిగితే.. ధాన్యం కుప్పలు తడిసిపోయాయని, తరుగు తీరు అలాగే ఉంటుందని, రైతులు ఒప్పుకున్న మేరకే తరుగు తీస్తున్నామని పీఏసీఎస్ సీఈవో బుచ్చయ్య దాటేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైనా గట్టిగా నిలదీస్తే కూలీలను పంపక, సంచులను నింపక, లారీలు ఏర్పాటు చేయక, రైస్‌మిల్లుకు కేటాయించక కావాలని ఆలస్యం చేస్తూ ఇబ్బందుల పాలు చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. అడ్డగోలు తరుగును నియంత్రించి రైతుల పక్షాన నిలవాల్సిన కోరుట్ల పీఏసీఎస్ పాలకవర్గం ప్రతినిధులు.. తాము ఎంత మొత్తుకుంటున్నా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కొత్తదాంరాజ్‌పల్లిలో ధర్నా చేస్తున్న రైతులు

కొత్తదాంరాజ్‌పల్లిలో రైతుల ధర్నా

మల్లాపూర్(కోరుట్ల): రైతుల జీవితాలతో మల్లాపూర్ సహకార సంఘం(సింగిల్‌విండో) చెలగాటం ఆడుతోందని కొత్తదాంరాజుపల్లి రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం కొత్తదాంరాజుపల్లిలో ధర్నా నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ, మల్లాపూర్ సహకార సంఘం చైర్మన్, డైరెక్టర్లు, సీఈవోల పొరపాటుతోనే తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అనుమతిలేని రైస్‌మిల్లుకు సుమారు 2,000 క్వింటాళ్ల ధాన్యాన్ని తరలించడంతోనే ధాన్యం అమ్మిన రైతులకు డబ్బులు రావడం లేదని ఆరోపించారు. విహార యాత్రలకు వెళ్లడానికి సమయం, డబ్బులు వెచ్చిస్తున్న సహకార సంఘం చైర్మన్, డైరెక్టర్లు.. రైతులు ధర్నా చేస్తుంటే పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. సహకార సంఘం చైర్మన్, డైరెక్టర్, సిబ్బంది నిర్వాకంతో జరిగిన తప్పును ప్రభుత్వంపై నెట్టివేయడం సరికాదని పేర్కొన్నారు. తక్షణమే రైతులకు రావాల్సిన ధాన్యం డబ్బులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు లింగారెడ్డి, రాజరెడ్డి, లక్ష్మారెడ్డి, మహేశ్‌రెడ్డి, ఆదిరెడ్డి, కమలాకర్‌రెడ్డి, గంగారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొడుకు పుట్టిన సంతోషం కాసేపైనా నిలువలే..

- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

సారంగాపూర్(జగిత్యాల): తనకు మొదటి సంతానం కొడుకు పుట్టాలని కోరుకున్నాడు.. ఊహించినట్లే కొడుకు జన్మించాడు. అయితే. ఐదు రోజులకే తండ్రి బద్ది సుధాకర్(24) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన కండెనకుంటలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. సుధాకర్‌కు ధర్మపురి మండలం నక్కలపేట శివారు దుబ్బగూడేనికి చెందిన అనితను ఏడాదిన్నర క్రితం వివాహం చేసుకున్నాడు. ఐదురోజుల కింద వీరికి కొడుకు జన్మించాడు. ఐదోరోజు గురువారం రాత్రి తన అత్తగారి ఇంట్లో బాబుకు మొలతాడు కార్యక్రమం నిర్వహించారు. తన తల్లితండ్రులు, అత్తగారితో కలిసి వేడుకల్లో సంతోషంగా పాల్గొన్నాడు. కార్యక్రమం పూర్తయ్యాక తల్లిదండ్రులను తన ద్విచక్రవాహనంపై స్వగ్రామం కండెనకుంటకు తీసుకొచ్చాడు. మళ్లీ దుబ్బగూడెం వెళ్లే క్రమంలో బీర్‌పూర్ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో సుధాకర్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రవీందర్ తెలిపారు. కాగా శుభకార్యం రోజే తన భర్త మృతిచెందడంతో భార్య అనిత, మృతుడి తల్లితండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

- మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: తెలంగాణ ఆవిర్భవించాక అన్నివర్గాల సంక్షేమంపై సీఎం కేసీఆర్ దృష్టి సారించారని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పలు పథకాల ద్వారా లబ్ధిపొందిన నియోజకవర్గ ప్రజలతో స్థానిక ఎస్‌హెచ్ గార్డెన్‌లో శుక్రవారం సంక్షేమ సంబురాలు నిర్వహించారు. కొప్పులతోపాటు కలెక్టర్ యాస్మిన్ బాషా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ, తెలంగాణలో రూ.2,016, రూ.3,016 పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, సీఎం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ అందజేస్తున్నామన్నారు. డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ, డీఆర్డీవో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

మున్నూరు కాపు సంఘ భవనం ప్రారంభం

వెల్గటూర్(ధర్మపురి): మండల కేంద్రంలో నిర్మించిన మున్నూరు కాపు సంఘ భవనాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించారు. పోచమ్మగుడి వద్ద రూ. 9.60 లక్షల వ్యయంతో దీనిని నిర్మించారు. మంత్రి మాట్లాడుతూ అన్ని కులాలకు సంఘ భవనాలు నిర్మించిన ఘనత ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, సర్పంచ్ మేరుగు మురళీగౌడ్, జెడ్పీటీసీ సుధారాణి, ఎంపీటీసీ హారి క, సింగిల్‌విండో చైర్మన్ గోళి రత్నాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులు.. భారీవర్షం

మల్లాపూర్(కోరుట్ల): మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. మల్లాపూర్, ఒబులాపూర్, కొత్తదాంరాజుపల్లిలో వర్షం బీభత్సం సృష్టించింది. చెట్లు విరిగిపడి పలుమార్గాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఇంటిపైకప్పులు ధ్వంసమయ్యాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయి మల్లాపూ తదితర గ్రామాలు అంధకారంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఒబులాపూర్ గ్రామంలో పందెన శేఖర్‌కి చెందిన ఫౌల్ట్రీఫాం పైకప్పులు ఈదురుగాలుల ధాటికి ఎగిరిపోయాయి. సుమారు రూ.1.50లక్షల నష్టం వాటిల్లిందని స్థానికులు తెలిపారు.



జాతీయ రహదారిపై విరిగిపడిన చెట్టు

సీఎమ్మార్‌పై నిర్లక్ష్యం

- గడువులోగా బియ్యం ఇవ్వని రైస్‌మిల్లర్లు
- 2022–23 వానాకాలంలో ఇచ్చింది 13 శాతమే
- మరోసారి గడువు పెంచిన అధికార యంత్రాంగం
- రంగంలోకి దిగిన కేంద్ర ప్రభుత్వం
- మిల్లుల్లో ధాన్యం నిల్వలపై తనిఖీలు

జగిత్యాలరూరల్: జిల్లాలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని వాటి సామర్థ్యాన్ని బట్టి రైస్‌మిల్లులకు ప్రభుత్వం కేటాయించింది. ధాన్యాన్ని మరపట్టించి బియ్యంగా మార్చి సర్కారు ఇచ్చిన గడువులోగా సీఎమ్మార్ అప్పగించాలి. కానీ, రైస్‌మిల్లర్లు బియ్యం అప్పగింతలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఫలితంగా బియ్యం సేకరణలో కేంద్రప్రభుత్వం జోక్యం చేసుకోవడంతోపాటు ఆంక్షలు విధిస్తోంది. అంతేకాదు.. నిర్దేశిత గడువులోగా బియ్యం అప్పగించాలని మిల్లర్లపై ఒత్తిడి పెంచుతోంది. మిల్లుల్లో అధికారులను నియమించి మరఆడించే పనులనూ పర్యవేక్షిస్తోంది.

సెప్టెంబర్ వరకు గడువు

- 2022–23 వానాకాలం సీజన్‌లో ప్రభుత్వం సేకరించిన 3,38,187 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని జిల్లాలోని 132 రైస్‌మిల్లులకు అప్పగించింది.
- ఆ ధాన్యం స్వీకరించిన మిల్లర్లు.. 2,26,585 మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎమ్మార్)ను ప్రభుత్వాని(ఎఫ్‌సీఐ)కి అప్పగించాల్సి ఉంది.
- కానీ, ఇప్పటివరకు కేవలం 28,780 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే మిల్లర్లు సర్కారుకు అప్పగించారు.
- రంగంలోకి దిగిన అధికారులు.. మిగతా బియ్యాన్ని సెప్టెంబర్ చివరి నాటికి అప్పగించాలని మిల్లర్లపై ఒత్తిడి తెస్తున్నారు.

ప్రతినెలా సమీక్ష..

- కస్టమ్ రైస్‌మిల్లింగ్ అప్పగింతలో రైస్‌మిల్లర్లు చేస్తున్న జాప్యంపై చర్యలు చేపట్టడంతో పాటు, ప్రతినెలా రైస్‌మిల్లర్లతో కలెక్టర్, అదనపు కలెక్టర్లు సమీక్షిస్తున్నారు.
- నిర్దేశిత గడువులోగా బియ్యం అప్పగించాలని రైస్‌మిల్లర్లను ఆదేశిస్తున్నారు.
- బియ్యం అప్పగించిన మిల్లర్లు మినహా అప్పగించని వారిని గుర్తించడంలో అధికారులు నిమగ్నమయ్యారు.
- వారికి ఈసారి ధాన్యం కేటాయించకుండా సంబంధిత శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.



జగిత్యాల శివారులోని ఓ రైస్‌మిల్లులో ధాన్యం నిలువలు

బియ్యం అప్పగింతలో జాప్యం..

జిల్లాలో 2021–22 వానాకాలం సీజన్‌లోనూ 3,25,444 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 135 మంది రైస్‌మిల్లర్లకు అప్పగించారు. మిల్లర్లు ఇప్పటివరకు 2,06,171 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని తిరిగి అప్పగించారు. ఇంకా 38 మంది రైస్‌మిల్లర్లు 11,875 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంది. 2021–22 యాసంగి సీజన్‌లో 2,70,776 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 125 మంది రైస్‌మిల్లర్లకు అధికారులు అప్పగించారు. మిల్లర్లు ఇప్పటివరకు 1,77,018 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీఎమ్మార్ కింద ఎఫ్‌సీఐకి అప్పగించారు. మిగతా ఏడుగురు రైస్‌మిల్లర్లు.. 6,400 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంది.

నిర్లక్ష్యంపై ఆగ్రహం..

జిల్లాలో ప్రభుత్వం సేకరించిన ధాన్యం తీసుకున్న రైస్‌మిల్లర్లు.. సకాలంలో సీఎమ్మార్ అప్పగించడంలో జాప్యం చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం మిల్లర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. దీంతోపాటు, ఆయా రైస్‌మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు చేపడుతోంది. ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం నిల్వ లు తరచూ తనిఖీ చేయిస్తోంది. నిల్వల్లో వ్య త్యాసం వచ్చిన మిల్లర్లపై తగిన చర్యలు తీసుకుంటోంది.

బియ్యం అప్పగించాలి



ప్రభుత్వం ఐకేపీ ద్వారా సేకరించిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు కేటాయించాం. రైస్‌మిల్లర్లు ప్రభుత్వానికి నిర్దేశిత గడువు ప్రకారం సీఎంఆర్ అప్పగించాలి. కానీ గత వానాకాలం బియ్యం ఇప్పటివరకు 13 శాతం మాత్రమే అప్పగించారు. ఇంకా 87 శాతం బియ్యాన్ని సెప్టెంబర్ చివరి వరకు అప్పగించాలని గడువు విధించాం.

– చందన్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి

సేంద్రియ ఎరువు.. దిగుబడి బాగు

- ఏటా పెరుగుతున్న డిమాండ్
- కోడి ఎరువు లారీ ట్రిప్పు ధర రూ.28 వేలు
- హైదరాబాద్ నుంచి జిల్లాకు 500 లారీల్లో సరఫరా



రైతులు తెప్పించుకున్న కోళ్లఎరువు

జగిత్యాలఅగ్రికల్చర్: గతంలో ప్రతీ రైతుకు ఎద్దులు, బర్రెలు, ఆవులతోపాటు మేకలు, గొర్రెలు ఉండేవి. అవి విసర్జించే మల, మూత్రాలతో సేంద్రియ ఎరువుగా తయారు చేసి పంటలకు పాటుగా వేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పశువులు, కోళ్లు, గొర్రెలు, బర్రెలు, ఆవుల ఎరువును ఫారాల నుంచి తెప్పించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వ్యవసాయ రంగంలో వీటి వినియోగం అధికం కావడంతో సేంద్రియ ఎరువుకు ఏటా ఏటా డిమాండ్ పెరుగుతూ వస్తోంది.

- జిల్లాకు ఏటా 800–1,000 లారీల కోడిఎరువు..
- హైదరాబాద్, సమీపంలోని కోళ్ల ఫారాల నుంచి జిల్లాకు ఏటా 800–1,000 వరకు లారీల్లో కోడి ఎరువు వస్తోంది.
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని జన్నారం, ఉట్నూర్ ప్రాంతాల నుంచి మరో 200 వరకు లారీల్లో పశువుల ఎరువు సరఫరా అవుతోంది.
- దీనికితోడు, రోజు రూ.2,000–రూ.3,000 వెచ్చించి వ్యవసాయ పొలాల్లో గొర్రెల మంద పెట్టిస్తున్నారు.
- జిల్లాలో ఎక్కువగా పసుపు సాగు చేస్తుండడంతో ఆ పంటకు సేంద్రియ ఎరువు అవసరం ఎక్కువగా ఉంటుంది.
- అందుకే రైతులు రెండెకరాలకు ఒక ట్రిప్పు లారీ చొప్పున కోళ్ల ఎరువు వినియోగిస్తున్నారు.

పెరుగుతున్న ధరలు..

- సేంద్రియ ఎరువు వినియోగం పెరుగుతుండడంతో ధరలు కూడా అదేరీతిలో పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఒకలారీ ట్రిప్పు కోడి ఎరువు ధర రూ.32 వేల నుంచి రూ.33 వేల వరకు పలుకుతోంది. పశువుల ఎరువు రూ.25 వేల నుంచి రూ.26 వేల వరకు ఉంది. గొర్రెల ఎరువు రూ.35 వేల నుంచి రూ.
- 36 వేలు పలుకుతోంది. పంటల సీజన్ సమీపిస్తుండడంతో ధర మరింత పెరుగుతోంది. లారీల్లో వచ్చిన ఎరువును పొలాల్లో చల్లడానికి మరో రూ.5 వేల వరకు ఖర్చు అవుతోంది. ఒక్కో రైతు కోళ్ల ఎరువుకే కనీసం రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది.

సేంద్రియంలోనే పోషకాలు..

- సేంద్రియ ఎరువులో మొక్కకు అవసరమైన అనేక పోషకాలు లభిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.
- ఏడాదికి ఒక పశువు నుంచి 7 టన్నులు(14ఎడ్ల బండ్లు)పేడ, 2,500 లీటర్ల మూత్రం వస్తుంది.
- దీనిప్రకారం, ఒకగేదె పేడతో ఏడాదికి 27.21 కిలోల నత్రజని(55 కిలోల యూరియాతో సమానం), 13.60 కిలోల భాస్వరం(85 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌తో సమానం), 6.8 కిలోల పొటాష్(12 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌తో సమానం), ఒకపశువు మూత్రంలో 29.16 కిలోల నత్రజని, 39.56 కిలోల పొటాష్, కొద్దిమొత్తంలో భాస్వరం ఉంటాయి.
- దీని ప్రకారం ఏ పంటకైనా రసాయన ఎరువులు వాడకుండా సేంద్రియ ఎరువు వేసి పంటలు పండించే అవకాశం ఉంది.

రెండు లారీల కోడిఎరువు వేస్త



పసుపు, మొక్కజొన్న పంటలకు ఏటా రెండు లారీల లోడ్ కోడిఎరువు తెప్పిస్తున్న. నేల బలవర్థకం కోసం సేంద్రియ ఎరువు వాడుతున్న. కోడి ఎరువు ధర అందనంత పెరుగుతంది. అయినా వాడడం తప్పడంలేదు.

– ఏలేటి జలేందర్‌రెడ్డి, ఇటిక్యాల, రాయికల్

తప్పనిసరి వాడాలి



ప్రతీరైతు సేంద్రియ ఎరువు తప్పనిసరిగా వాడాలి. పశువులు, కోళ్ల ఎరువుల ధరలు పెరుగుతున్నాయి. అయితే, కొంతమంది రైతులు అవసరం ఉన్నా, లేకున్నా రసాయన ఎరువులు వేస్తున్నారు. దీనిద్వారా రైతులకు ఖర్చుతో పాటు పంట పండే సత్తువను నేల కోల్పోతుంది.

– సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

బీసీల రిజర్వేషన్లు పెంచుతాం

- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అమలు చేస్తాం
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్(జగిత్యాల): కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీసీ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 40 శాతానికి పెంచుతామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అభయం ఇచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీల జనాభా 60 శాతంగా ఉందని, వారికి విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు 25 శాతానికి పరిమితం చేశారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత స్వయం ఉపాధి పథకాల్లో నిరుద్యోగ యువతకు నిరాశే మిగిలిందని దుయ్యబట్టారు. మాజీ ఎంపీపీ ధర రమేశ్ బాబు, మాజీ వైస్ ఎంపీపీ కొండ్ర రాంచంద్రారెడ్డి, నాయకులు ఆకుల రాజిరెడ్డి, కొక్కు గంగారాం, వురుమల్ల లక్ష్మారెడ్డి, చుక్క గంగయ్య, కాలగిరి సత్యనారాయణరెడ్డి, పెద్దిరెడ్డి స్వామిరెడ్డి, కాలగిరి మధు, వురుమల్ల శరత్, కొక్కు ఉపేందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిన్న సినిమాలను ఆదరించాలి



కేక్‌కట్ చేస్తున్న నిర్వాహకులు

జగిత్యాల: చిన్న సినిమాలను ఆదరించాలని దర్శకుడు రాజేనరేంద్ర కోరారు. జగిత్యాలకు చెందిన యువ హీరోలు వెంకీ, ఈశాన్, సందీప్ సక్సేనా నటించిన బైరాన్‌పల్లి సినిమా విడుదల సందర్భంగా స్థానిక దుర్గ థియేటర్‌లో శుక్రవారం కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. తెలంగాణ వచ్చిన తర్వాత చిన్న హీరోలు నటించిన సినిమాలకు ఆదరణ పెరిగిందన్నారు. ప్రాంతీయ నటనను ఆదరించి ప్రోత్సాహం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశ్రీ అధినేత గుండేటి రాజు, శ్రీనివాస్‌గౌడ్, గుగ్గిళ్ల రాము, మహేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు



బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ వాసవి

కోరుట్ల: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ నెల 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు వ్యాసరచన, ఉపన్యాస, పాటలు, నృత్యం, చిత్రలేఖనం, రంగవల్లి వంటి పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నీలి వాసవి, వైస్ ప్రిన్సిపాల్ బూర్ల నరేశ్, కార్యక్రమ కన్వీనర్ నాగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి చంద్రంపేట బైపాస్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. సిరిసిల్లకు చెందిన చేపూరి రాజేందర్ తన కొడుకు సంపత్‌తో కలిసి బయటకెళ్లి తిరిగి ఇంటికొస్తుండగా చంద్రంపేట బైపాస్ వద్ద కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే సిరిసిల్లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

వేములవాడలో మూడు బైక్‌లు చోరీ

వేములవాడ: వేములవాడలో మూడు బైక్‌లు చోరీకి గురయ్యాయి. రాజన్న గుడి ముందు పార్క్ చేసిన పారువెల్ల శ్రీనాథ్, బస్టాండు వద్ద పార్క్‌చేసిన జునేద్, బస్టాండులోనే మరో రెండు బైక్‌లను గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లినట్లు వాహన యజమానులు తెలిపారు. ఈమేరకు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి



సత్యనారాయణ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని అల్మాస్‌పూర్‌కు చెందిన సిరిసిల్ల సత్యనారాయణ(70) అనే వృద్ధుడు శుక్రవారం వడదెబ్బతో మృతిచెందాడు. పనిమీద బయటకు వెళ్లిన సత్యనారాయణ ఎండదెబ్బకు లోనయ్యాడు. ఇంటికొచ్చిన అనంతరం తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న అతన్ని ఆస్పత్రికి తరలించేలోపే మరణించాడు. మృతునికి భార్య అనసూర్య, కుమారులు ప్రమోద్, వినోద్, కూతురు కవిత ఉన్నారు. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

కార్పొరేట్ స్కూళ్లపై కేసులు నమోదు చేయాలి

- ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యుడు రాపాక సాయికుమార్
- పట్టణంలోని ప్రైవేట్ కళాశాల ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

జగిత్యాలటౌన్: నిబంధనలకు విరుద్ధంగా వేసవి సెలవుల్లో బోధన తరగతులు నిర్వహిస్తూ, విద్యార్థులను మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్న పట్టణంలోని కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యుడు రాపాక సాయికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏబీవీపీ కార్యకర్తలు పట్టణంలోని ఓ కార్పొరేట్ పాఠశాల ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. సాయికుమార్ మాట్లాడుతూ, కార్పొరేట్ పాఠశాలలో ఫైర్‌సేఫ్టీ లేదని, ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యులన్నారురు. విద్యార్థులు ఆడుకునేందుకు కనీసం ఆటస్థలం, పార్కింగ్ సదుపాయాలు లేవని అన్నారు. వేసవి సెలవుల్లోనూ అడ్మిషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. పలు పాఠశాలల్లో అధిక ధరలకు పుస్తకాలు విక్రయిస్తున్నా విద్యాశాఖ చోద్యం చూస్తోందని విమర్శించారు. జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి నందు తదితరులు పాల్గొన్నారు.

కూర రాజన్నను రాజ్యం చంపాలని చూస్తోంది

- అక్రమ కేసులు ఎత్తివేయాలి
- పోలీసుల అణచివేతకు వ్యతిరేకంగా ఉద్యమించాలి
- జనశక్తి జిల్లా నాయకుడు కిరణ్

సిరిసిల్ల: సీపీఐ(ఎంఎల్) జనశక్తి అగ్రనాయకుడు కూర రాజన్నను రాజ్యం చంపాలని చూస్తోందని జనశక్తి జిల్లా నాయకుడు కిరణ్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసులు రాజన్నపై నమోదు చేసిన అక్రమ కేసుల విషయంలో కోర్టుకు హాజరవుతూ.. కోర్టు షరతుల మేరకు వేములవాడలో ఉంటే.. రాజన్నను కలిసే వారిని పోలీసులు వేధిస్తున్నారని కిరణ్ ఆరోపించారు. అనారోగ్యంతో రాజన్న ఇద్దరు మనుషులు లేనిదే కదిలే పరిస్థితి లేదని.. 12 రకాల ఆపరేషన్లు అయ్యాయని పేర్కొన్నారు. రాజన్న పిటిషన్లతో కోర్టు కూడా షరతుల నుంచి మినహాయింపు ఇస్తే వేములవాడ పోలీసులు వేధిస్తున్నారని తెలిపారు. సిరిసిల్లకు చెందిన పోకల సాయికుమార్‌ను, వేములవాడకు చెందిన మానుక కుంటయ్యను అక్రమంగా అరెస్టు చేశారని, జనశక్తి రాజన్నకు సహకరిస్తున్నారనే తప్పుడు కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామిక వాదులు, మేధావులు, పౌర సంఘాలు అక్రమ అరెస్టులను ఖండించాలని, పోలీసుల అణచివేతకు వ్యతిరేకంగా ఉద్యమించాలని కిరణ్ పిలుపునిచ్చాడు. అక్రమ కేసులను ఎత్తివేయాలని, ప్రజాసమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు.

డ్రైనేజీ పనులు అడ్డుకున్న గ్రామస్తులు



పనులు పరిశీలిస్తున్న గ్రామస్తులు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం గోపాల్‌రావుపేట గ్రామంలో డ్రైనేజీ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని గ్రామస్తులు శుక్రవారం పనులను అడ్డుకున్నారు. జగిత్యాల–ధర్మపురి జాతీయ రహదారి పక్కన గోపాల్‌రావుపేట గ్రామంలో మురుగునీటి కాలువ నిర్మిస్తున్నారు. దీని నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో కొద్దికాలానికే కూలిపోతుందని గ్రామస్తులు ఆరోపించారు. ఈమేరకు పనులు అడ్డుకున్నారు.

విదేశీ ఉద్యోగ మేళాకు స్పందన

- నాలుగు జిల్లాల నుంచి హాజరైన 130 మంది
- ప్రత్యేక ఇంటర్వ్యూ అనంతరం వివరాల నమోదు
- వారంరోజుల్లో సమాచారమిస్తామని వెల్లడి



ఉద్యోగ మేళాకు హాజరైన నిరుద్యోగులు

రామగుండం: విదేశాల్లో ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో రామగుండంలోని ఐటీఐలో శుక్రవారం ఏర్పాటు చేసిన విదేశీ ఉద్యోగ మేళాకు స్పందన వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కాం) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళాకు నాలుగు జిల్లాల నుంచి 130 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరికి ప్రత్యేక ఇంటర్వ్యూ నిర్వహించి వివరాలు నమోదు చేసుకున్నారు. వారం రోజుల్లోగా సమాచారం ఇస్తామని వెల్లడించారు.

ఇంటర్వ్యూలు నిర్వహించిన ఉద్యోగాల వివరాలు..

ఆస్ట్రేలియాలో ప్లాంట్ మెకానిక్, మెకానికల్ ఫిట్టర్, మెకానికల్ ఇంజినీర్, వెల్డర్, బైలర్ మేకర్, ఫ్యాబ్రికేటర్, జర్మనీలో ఆస్‌బిల్డంగ్ ప్రోగ్రామ్స్, కన్‌స్ట్రక్షన్స్, ఫుడ్ ప్రాసెసింగ్ (నాన్ వెజ్), రిటైల్ సేల్స్, వేర్‌హౌస్ క్లర్క్, ట్రక్ డ్రైవర్స్, వెసెల్ కంటైనర్ మేకింగ్, పోలాండ్‌లో వెల్డర్స్, ఫిట్టర్స్, యూఏఈలో ఫోర్‌మెన్ ప్లాంటర్, మెషినిస్ట్, మెకానికల్, వర్క్ ప్రిపరేటర్ పైపింగ్, వర్క్ ప్రిపరేటర్–స్ట్రక్చరల్, ఫోర్‌మెన్ రబ్బర్ ప్రొపెల్లర్, ప్లాటర్ ఫ్యాబ్రికేటర్, పైపింగ్ సూపర్‌వైజర్, బ్లాస్టింగ్, వెల్డర్, ఫోర్‌మెన్ మెకానికల్ తదితర ఖాళీలకు అభ్య నుంచి ఇంటర్వ్యూ నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు.

అబ్రాడ్‌లో కొలువు చేయాలని..



నేడు డిగ్రీ చదివా. ప్రస్తుతం హెవీ వెహికల్ డ్రైవర్‌గా పనిచేస్తున్న. ఉద్యోగం చేయాలనే కోరిక ఉంది. పత్రికల్లో వచ్చిన ప్రకటనను చూసి ఇంటర్వ్యూకు వచ్చా. ధ్రువీకరణపత్రాలు సమర్పించ. మూడురోజుల్లో కాల్ చేస్తామన్నారు.

– ఎండీ.సాజిద్ అహ్మద్, మంచిర్యాల

ఆస్ట్రేలియాలో ఉపాధి కోసం..



నేను మైనింగ్‌లో ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తి చేశా. ప్రస్తుతం ప్రైవేటుగా జాబ్ చేస్తున్న. విదేశాల్లోని మైనింగ్ కంపెనీల్లో ఉద్యోగం చేయాలని ఉంది. టామ్‌కాం ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూకు హాజరయ్యా. ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేయాలనే విషయాన్ని వారికి తెలిపా.

– శ్రీవెంకటేశ్వర, గుంజపడుగు. పెద్దపల్లి జిల్లా

ఆఫ్రికాలో ఉద్యోగం కల్పించాలని..



నేను ఐటీఐలో ఫిట్టర్ పూర్తి చేసి గోదావరిఖనిలో అప్రెంటిషిప్ చేస్తున్న. విదేశాల్లో ఉద్యోగ ప్రకటన చూసి ఇంటర్వ్యూకు వచ్చా. పెళ్లికి ముందే ఐదేళ్లు విదేశాల్లో ఉద్యోగం చేసి వస్తే ఆర్థికంగా బాగుంటుంది. ఆఫ్రికా దేశంలో ఉద్యోగం కల్పించాలని కోరా.

– బందారి అవినాష్, ఖమ్మం

ఇంటర్వ్యూకు రావడం మొదటిసారి



నేడు ఐటీఐలో ఎలక్ట్రిషియన్ పూర్తి చేసి మంచిర్యాల సింగరేణి కాలరీస్‌లో అప్రెంటిషిప్ చేస్తున్న. నా అర్హతకు సంబంధించి ఆస్ట్రేలియా, జర్మనీ దేశాల్లో ఉన్న ఉద్యోగ ఖాళీలకు దరఖాస్తు చేశా. అబ్రాడ్‌లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూకు రావడం ఇదే మొదటిసారి.

– తుమ్మ వైష్ణవి, మంచిర్యాల

తగిన ఉద్యోగం వస్తే చాలు



నేను బీఎస్సీ (ఎంసీసీఎస్) చదివా. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఏజెన్సీ టామ్‌కాం కావడంతో నమ్మకంతో విదేశాల్లో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునేందుకు వచ్చా. వివరాలన్నీ నమోదు చేసుకొని పది రోజుల్లోగా సమాచారం ఇస్తామన్నారు.

– మేర్గు సాగర్‌గౌడ్, పెద్దంపేట, పెద్దపల్లి జిల్లా

15ఏళ్లు అరబ్ దేశాల్లో పనిచేశా



నేను పదిహేనేళ్లు వివిధ అరబ్ దేశాల్లో పనిచేసి కొన్ని పనుల నిమిత్తం ఇండియాకు తిరిగి వచ్చా. ప్రస్తుతం నాన్ అరబ్ దేశాల్లో ఉద్యోగం చేయాలని నిర్ణయించుకున్న. నా అర్హత, విదేశాల్లో చేసిన పనులు తదితర ధ్రువీకరణపత్రాలు అందజేశా.

– ఎండీ.సాదిఖ్, సిరిసిల

అర్హతలున్న వారందరికీ ఉద్యోగం కల్పిస్తాం



ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హతలున్న వారందరికీ విదేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తాం. మేళాకు వచ్చిన వారి నుంచి స్వీకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తాం. పరిశీలించి మళ్లీ ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తాం. విదేశాల్లో ఉద్యోగం చేయాలనుకునే వారు ప్రయివేటు కన్సల్టెంట్లను ఆశ్రయించి మోసపోకుండా ప్రభుత్వ పక్షాన నిర్వహించే మేళాకు హాజరైతే తక్కువ ఖర్చుతో వెళ్లొచ్చు.

– శ్రావణి తలశిల, హెచ్ఆర్ మేనేజర్, టామ్‌కాం

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజయ్, నాయకులు

రాయికల్(జగిత్యాల): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. కుర్మపల్లి గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన గ్రామపంచాయతీ భవన నిర్మాణం, రూ.2.50 లక్షల వ్యయంతో చేపట్టాన కురుమ సంఘం భవన అదనపు పనుల నిర్మాణానికి ఎమ్మెల్యే శుక్రవారం భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతీగ్రామంలో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు ఇంటింటా లబ్ధి కలిగిస్తున్నాయని గుర్తుచేశారు. సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు అనవసర ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. సర్పంచ్ మ్యాకల సుమలత, ఎంపీటీసీ మోర విజయలక్ష్మి, ఉపసర్పంచ్ పుల్ల మల్లేశం, కో ఆప్షన్ సభ్యులు ముఖీద్, నాయకులు సాగర్‌రావు, స్పందన, సాయికుమార్, బర్కం మల్లేశ్, ప్రసాద్, రత్నాకర్, గంగాధర్, విక్రమ్ పాల్గొన్నారు. కాగా, కులవృత్తులకు రూ.లక్ష సాయం ప్రకటించడంపై మ్యాదరి సంఘం నాయకులు ఇందూరి గంగాధర్, చిలువేరి సురేశ్, లచ్చయ్య, చిలువేరి మల్లేశం, రాజయ్య, అశోక్ ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమక ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ పాత్రికేయ జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు సయ్యద్ రసూల్, శంకరయ్య, వాసరి రవి, మచ్చ శేఖర్, కడకుంట్ల జగదీశ్వర్, ముంజ ధర్మపురి, లింబాద్రి, సాయికుమార్, రవి, శ్రీనివాస్, గంగాధర్, శ్రీనివాస్, కిరణ్‌రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

సిగ్నల్ కేబుల్ దొంగల అరెస్టు



రైల్వే పోలీసుల అదుపులో నిందితులు

మల్యాల(చొప్పదండి): నూకపల్లి రైల్వేస్టేషన్‌లో సిగ్నల్ కేబుల్‌ను దొంగిలించిన 10మందిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. రామగుండం ఆర్పీఎఫ్ సీఐ బుర్ర సురేశ్‌గౌడ్ కథనం ప్రకారం.. మల్యాల మండలం నూకపల్లి రైల్వేస్టేషన్‌లో సుమారు 500మీటర్ల పొడవైన కాపర్ వైరు ఈ నెల 4న చోరీ గురైంది. రైల్వే ఏఎస్సై ఎం.శ్రీనివాస్, సిబ్బంది జైపాల్, రోహిత్, బెనర్జీ చాకచక్యంగా దొంగలను పట్టుకున్నారని సీఐ తెలిపారు. ఈ మేరకు కేబుల్ చోరీకి పాల్పడిన బండి కుమార్, బండి కిరణ్, బండి ఎల్లయ్య, జగన్నాథుల రాజయ్య, కేంసారలపు రాజయ్య, కుటడి రవికుమార్, కోమసారపు మల్లయ్య, పాలకుర్తి సంపత్, నల్ల గొండ స్వరూప, దొంతుల శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. వారి నుంచి సుమారు రూ.4లక్షల విలువ చేసే కాపర్ కేబుల్ స్వాధీనం చేసుకున్నామన్నారని సీఐ వివరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

TO-LET

■ సిరిసిల్ల గాంధీనగర్, లక్ష్మీటాకీస్ ఎదురుగా, మార్కెట్ ఏరియాలో 3 షెటర్లు, 4 ఫ్లోర్లు, (ఫ్లోరుకు 1000 చ.ఫీట్లు) మొత్తం 3000 Sq. Ft. గల బిల్డింగ్ కిరాయికి ఇవ్వబడును. సంప్ర: 9440488956, 9490257222. [K-1219950]

HOTEL FOR SALE

■ Hotel For Sale in Goa at Calangute Beach, 29 Rooms,with Swimming Pool, Bar & Restarurant, Spa, Price 35Cre Call: 9881931111, Broker Excuse. [HA-29536]

WANTED

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా రోజుకు 50 మెసేజీలు పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 38520, 90596 38520. [M-1221311]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం, జీ: 18K ఏజెంట్స్ కమీషన్ 6K ఫోన్ : 9640258899 [H-793440]

■ సూపర్‌వైజర్లు, హెల్పర్లు, హౌస్ కీపింగ్ బాయ్స్, రైల్వే స్టేషన్, హోటల్, ఆఫీసుల్లో క్లీనింగ్ వర్కర్స్ కావలెను. బయోడేటా వాట్సాప్ చేసి ఫోన్ చేయండి. RSR. Cell: 77029 59468 [V-1935]

గమనిక: సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

www.sakshi.com

For Classifieds, Advertisements Contact: 9951602933, 9951602824

న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను

తెలుగు పత్రికారంగంలో కొత్త పోకడలు, సరికొత్త అంచనాలకు శ్రీకారం చుట్టిన 'సాక్షి' మిమ్మల్ని తన కుటుంబంలోకి సాదరంగా ఆహ్వానిస్తోంది. జర్నలిజంపై ఆసక్తి, తెలుగులో సూటిగా సరళంగా రాయగల నేర్పుంటే చాలు మీరు 'సాక్షి'లో కంట్రిబ్యూటర్లుగా చేరవచ్చు.

కంట్రిబ్యూటర్లు కావలసిన కేంద్రాలు

1. పెద్దపల్లి కలెక్టరేట్ 2. పెద్దపల్లి కమాన్ 3. జగిత్యాల అర్బన్ 4. మెట్‌పల్లి రూరల్ 5. మేడిపెల్లి 6. రామగిరి 7. ముత్తారం

పరీక్ష తేదీ : 12-06-2023, సోమవారం ఉ॥ 11 గంటలకు

అర్హతలు :

SAKSHI MEDIA GROUP www.sakshi.com

పరీక్షా కేంద్రం : సాక్షి యూనిట్ కార్యాలయం గ్రా, మం॥ తిమ్మాపూర్ జిల్లా॥ కరీంనగర్